

# పాపం పరంధామయ్య

— ఎమ్. నాగమణి —

పచ్చని పొలాల్ని దాటుకుంటూ, పంట కాలవల్ని పలకరిస్తూ వేగంగా పోతోంది రైలు. ఏం పొద్దుపోక కిటికీ గుండా చూస్తూ కూర్చున్నాడు పరంధామయ్య. "నేను ఊళ్ళో లేకపోయేసరికి ఒక పని సరిగ్గా చేసి చావరు ఈ పాలేర్లు" అని అనుకున్నాడు. రైలెక్కాక అలా అనుకోవడం అది ఇరవై ఆరోసారి!

చెట్ల మధ్య గుండా కనిపిస్తున్న చిన్న చిన్న పల్లెలు దాగుడు మూతలు ఆడుతున్న చిన్న పిల్లల్లా ఉన్నాయ్. రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. పాలవాళ్ళు ఇంతింతేసి పాల బిందెల్ని గబగబా ఎక్కించేస్తున్నారు కంపార్‌మెంట్స్‌లోకి. బిందెల్లోంచి కొద్దిగా ఒలుకుతున్న పాలని చూస్తూ.."వీటిని పట్నాలకి తీసుకుపోయి నగానికి నగం నీళ్ళు కలిపి అమ్మేస్తారు కాబోలు వీళ్ళు.. పల్లెల్లో కూడా నిజాయితీ తగ్గి పోయింది. అంతా కల్తీ ... పాలు, నెయ్యి, నూనె, బియ్యం, పప్పు, ఉప్పు ... అంతా కల్తీనే.." అని అనుకున్నాడు పరంధామయ్య నిట్టూరుస్తూ.

రైలు మళ్ళీ బయలుదేరింది.

పేపర్ చదవడంలో నిమగ్నమైన పరంధామయ్యకు రైలు విజయవాడ చేరేవరకు తను ఎక్కడున్నాడో గుర్తే రాలేదు. స్టేషన్ చాలా కోలాహలంగా ఉంది. ఎటు చూసినా ఏదో ఒకటి అమ్మేవాళ్ళు కొనుక్కునే వాళ్ళూనూ. వచ్చే పోయేవాళ్ళు ఏదో ప్రళయం వస్తున్నంతగా గాబరా పడిపోయి పరుగులు పెడ్తు న్నారు. చేతుల్లో సామాన్లు ఇతరులకి తగుల్తుందన్న భయంగాని, బిడియం గాని లేవు వాళ్ళలో.

బోషాణాల్లా ఉన్న రెండు పెట్టెల్ని అవలీలగా మోసుకొస్తున్న ఓ పంజాబీ యువతిని చూసి.."తన బరువు, ఆ రెండు పెట్టెల బరువు ... బాబోయ్ ... ఈమె అబల కాదు, అక్షరాల సబల ..." అని అనుకున్నాడు పరంధామయ్య అటే చూస్తూ.

ఎదురుసీట్లో ఇంతకు ముందు కూర్చున్న ఇద్దరూ దిగేశారులా ఉంది. వాళ్ళ సామానులు లేవు. అదే స్థానంలో ఎవరో ఒక యువకుడు కూర్చుని మాగజైన్ తిరగేస్తున్నాడు.

రైలు విజయవాడ స్టేషన్ వదలంగానే వేగం పుంజుకుంది. కళ్ళజోడు లోంచి చుట్టూరా పరికించి చూశాడు పరంధామయ్య. కంపార్టుమెంట్‌లో ఎక్కువ మంది లేరు. ఓ చిన్న పిల్లవాడు వేరు శనక్కాయలు తింటూ తొక్కల్ని క్రిందంతా పోస్తున్నాడు. ఒక ముసిలాయన కిటికీకి తల ఆనించి కునుకు తీస్తున్నాడు. మారాం చేస్తున్న పసి పిల్లను మంద లిస్తోంది ఆమె తల్లి.

పరంధామయ్యకు పొద్దు పోవడం లేదు.

"ఏ ఊరెళ్ళాలోయ్?" అన్నాడు ఎదురుగా

కూర్చున్న యువకుడ్ని ఉద్దేశించి.

"కాకినాడండీ" అన్నాడతను మాగజైన్‌లోంచి తల పైకెత్తుతూ.

"నేనూ అదే ఊరులే ... మరీ ...మన్దే ఊరు?"

"విజయవాడండీ"

"ఆఁహా - ఏం పనే కాకినాడలో? చదువుతున్నావా అక్కడ?"

వరంధామయ్య ప్రశ్నలు విసుగును కలిగించాయి ఆ యువకుడికి. కానీ పైకి మాత్రం నమ్రతగానే జవాబిచ్చాడు.

"అవునండీ ... హవుస్ సర్జన్".

"పెళ్ళయిందా?"

ఈ ప్రశ్నకు కాస్త సిగ్గుపడ్డాడు యువకుడు.

"ఇంకా లేదండీ ... త్వరలోనే అవబోతోంది" అన్నాడు నవ్వుతూ.

"కట్నం ఎంతేయ్? అహ .... ఈ రోజుల్లో ఈ ప్రశ్న అడగనూకూడదు ... చెప్పనూకూడదు అనుకో ...అయినా ఏదో పెద్దవాణ్ని ... కుతూహలం కొద్దీ.."

"అమ్మాయే కట్నం అంటే!"

"లవ్ మారేజేమిటోయ్ కొంపదీసి!" వరంధామయ్య తల కాస్త ముందుకు వంచుతూ అడిగాడు.

తల ఊపాడా యువకుడు.

"ఏమిటోనోయ్ ... మా రోజుల్లో ఎరగవోయ్ ఇలాంటివన్నీ ... ఏ పెళ్ళిళ్ళ పేరయ్యో ఫలానా వారి సంబంధం మంచిదీ అని చెప్పేవాడు. పెద్దలు నిర్ణయించేవారు. పిల్లదాన్ని మెళ్ళో మూడు ముళ్ళూ వేసేవాడు పెళ్ళి కొడుకు. పెళ్ళయ్యాకే పెళ్ళాన్ని చూడ్డమూ, ప్రేమించడమూనూ - కానీ ఈ కాలం పిల్లలు రాకెట్లోయ్ రాకెట్లు! వాళ్ళు చూడాలి, వాళ్ళకు నచ్చాలి, వాళ్ళతో తిరగాలి ... అప్పుడే పెళ్ళి - ఇహ - కొందరయితే ఒకళ్ళనో ఇద్దర్నో కనేసి అప్పుడు పెళ్ళి మాటెత్తుతున్నారు" అన్నాడు వరంధామయ్య భళ్ళున నవ్వేస్తూ. నవ్వకుండా ఉండలేక పోయాడు ఆ యువకుడు.

వీళ్ళ సంభాషణ వింటున్న ఇద్దరు ముగ్గురు నవ్వు ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

వరంధామయ్య మళ్ళా మొదలెట్టాడు తన వాగ్ధోరణి!

"మా రోజుల్లో అయితే పిల్ల పెద్దది అవంగానే పెళ్ళి చేసి పంపించేసేవాళ్ళు భర్త, పిల్లలు, సంసారం, అత్త మామలు .. ఇదీ వాళ్ళ లోకం, ఓ పది కోళ్ళు, రెండు పాడి గేదెలు పెట్టుకుని లక్షణంగా కాపురం చేసేవాళ్ళు. ఈ కాలం పిల్లలేవేరోయ్.. నా పిల్లలే నా మాట వినరు. చదువులో చదువులో అంటూ పట్నాలకు ఎగబడ్డారు ..." అన్నాడాయన విసుక్కుంటూ.

"చదువులు ఉండాల్లెండి ఈ రోజుల్లో - ఉద్యోగం చేసినా చేయకపోయినా చదువంటూ ఉంటే ... ఐమీన్ .. స్త్రీల సంగతి నేను చెప్పేది .. తరువాత బుద్ధి పుడ్తే ఉద్యోగం చేసుకోవచ్చు. పైగా పిల్లలు పెద్దవాళ్ళయ్యాక అంతగా పని ఏం ఉంటుంది ఆడవాళ్ళకు ఈ రోజుల్లో? ఉద్యోగం చేయకపోయినా కనీసం పిల్లల్ని ట్యూషన్‌కి పంపే బాధన్నా తప్పుతుందిగా!" అన్నాడు ఆ యువకుడు చిన్నగా నవ్వుతూ. వరంధామయ్య ధోరణి చూస్తూంటే అతనికి నవ్వు వస్తోంది. పరమ ఛాందసుడిలా ఉన్నాడు! అని అనుకున్నాడు మనసులో.

"ఆఁ ఏం ఉద్యోగాలోయ్ ... మా పక్కింటాయన అవస్థ చూస్తూనే ఉంటాంగా ... ఆయన పెళ్లాం కాలేజీలో లెక్చరర్. సాయంత్రం అయ్యేసరికి ఉసూరుమంటూ వస్తుంది ఇంటికి, వంటామె కాచిన టీ నీళ్ళు కాసిని గొంతులో పోసుకుంటే గానీ ఈవిడ గారికి పోయిన ప్రాణం తిరిగిరాదు. ఇక రోజూ మహాభారత యుద్ధం జరగాల్సిందే ఇంట్లో ఏదో ఒక విషయంపై-" అన్నాడు వరంధామయ్య చేతులు జోరుగా ఊపేస్తూ.

"స్త్రీ జాబ్ చేసినంత మాత్రానే ఇల్లు కురుక్షేత్రం కావాలని ఎక్కడుందండీ!" అంటూ నవ్వేశాడు యువకుడు.

"ఏమిటోనోయ్ .. కాలం మారిపోతోంది. ఈ కలియుగం కూడా బుటుక్కు మంటుంది ఎప్పుడో..." అంటూ వరంధామయ్య రెండు అరటి పళ్ళు తీసి ఒకటి ఆ యువకుడికి ఇచ్చి మరొటి తను తింటూ కూర్చున్నాడు.

సిగ్నల్ ఇవ్వలేదు కాబోలు ... రైలు ఊరు బయట ఆగింది కొంత సేపు. ప్రక్కనే ఉన్న తోటల్లోంచి జామకాయలు తెచ్చి అమ్ముతున్నారు పిల్లలు కొందరు. రేటు అడిగి బేరం చేశాడు వరంధామయ్య.



లక్కీనెంబర్

కనకం : అదేమిటి పెళ్ళికొడుకు నాలుగు ముళ్ళు ఎందుకు వేస్తున్నాడు?

శాంత : నాలుగు అతడి లక్కీ నెంబరుట తల్లీ!

— జి. రుక్మిణీ దేవి

తోటల్లో దొంగిలించేసి ఉంటారు పిల్ల వెధవలు. అందుకే ఇంత చవగ్గా పారేసి పోతున్నారు. తాటికాయలంతేసి ఉన్నాయ్ కాయలు ..." అంటూ ఓ డజను కొనుక్కొని బాగ్‌లో వేసుకున్నాడాయన.

కొద్ది సేపటికి బండి మళ్ళీ బయలుదేరింది. ఏం తోచక తలుపు దగ్గర నిల్చున్నాడా యువకుడు. ఎటు చూసినా జామ తోటలు, అరటి తోటలు. "ఎండనకా వాననకా వీళ్ళింత కష్టపడి పనిచేస్తే నాలుగు డబ్బులు కూడా గిట్టుబాటు కావు వీళ్ళకు. పండించేవాడు, కొనుక్కునేవాడు ఎప్పుడూ నష్ట పోతూనే ఉంటారు. మధ్యలో మోసం చేసే వ్యాపారస్తులే లక్షలు సంపాదించేది" అని అనుకున్నాడు తోటల్లో తిరుగుతున్న మనుష్యుల్ని చూస్తూ. వెనక్కి తిరిగి చూశాడు. వరంధామయ్య పేపర్ చదువుతూ కూర్చున్నాడు.

"పద్మ ఏం చేస్తోందో .. స్టేషన్‌కి వస్తుంది తప్పకుండా. ఈ ట్రెయిన్ తొందరగా కాకినాడ చేరితే బాగుణ్ను." అని అనుకున్నాడు వాచి చూసుకుంటూ. కొంచెం సేపయ్యాక తన సీట్లో వచ్చి కూర్చున్నాడు. రైలు ఎంత వేగంగా పోతున్నా ఎడ్లబండి నడకలా అన్పించింది అతనికి.

వరంధామయ్య తలెత్తి ఆ యువకుడి వేపు చూశాడు. "పిల్లవాడు లక్షణంగా చూడముచ్చటగా ఉన్నాడు. కానీ ఇతగాడు ప్రేమా దోమా అంటూ ఓ ఆడపిల్ల వెంటబడి తిరగడమే ఏం బాగా లేదు. కనీసం ఆ పిల్లకైనా బుద్ధి ఉండొద్దు ..." అని అనుకున్నాడు నిట్టూరుస్తూ.

"ఏంవోయ్ ... ఒక మాట .. ఆ పిల్లతో నువ్ సినిమాలకీ, హోటళ్ళకీ, బీచిలకు తిరిగేస్తూ ఉంటావా?" అన్నాడు చివరికి కుతూహలంగా.

"తప్పేం ఉందండీ? కాబోయే పెళ్ళాం కదా!" అన్నాడు ఆ యువకుడు నవ్వుతూ.

"ఒక వేళ నువ్ నాలుగు రోజులు పోయాక పెళ్ళి చేసుకోను అంటే ఆ పిల్ల గతేం కావాలోయ్? కథల్లో, సినిమాల్లో చూడ్డంలా ఇలాంటివన్నీ?"

"మరొకడ్ని వెతుక్కుంటుంది. తను నన్ను మోసం చేసిందనుకోండి ... హాయిగా మరొక అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుంటాను. అంతేగా - సింపుల్!" అన్నాడు చిలిపిగా నవ్వుతూ. కొంచెం సేపు ఆగి మళ్ళీ అన్నాడు. "అలా జరిగే ప్రసక్తే లేదండీ. మా కులాలు వేరవడంతో పెద్దవాళ్ళు ఒప్పుకోరు. ముఖ్యంగా ఆమె తండ్రి. అందుకే రిజిస్టర్ మారేజ్ చేసుకోవాలని డిసైడ్ చేసుకున్నాం ... ఇంతకీ మీరేం పని మీద వెళ్తున్నారు కాకినాడ?" అన్నాడు. పెళ్ళిళ్ళ టాపిక్ మార్చాలని అతడి ఉద్దేశం.

"ఏదో వ్యాపారం పనిలేవోయ్.." అన్నాడు వరంధామయ్య టూకీగా ...తన కూతురు కూడా హవుస్ సర్జన్ చేస్తోంది ... ఆపిల్లను చూడాలని అనిపించి సడెన్‌గా ఊరు వెళ్తున్నానని ఆ యువకుడితో చెప్పదల్చుకోలేదు ఆయన. తనతో ప్రయాణం చేసిన వంక పెట్టుకుని పిల్లదానితో ఎక్కడ పరిచయం పెట్టుకుంటాడో అని ఆయన భయం!

'మెడిసిన్ వద్దే తల్లీ - అంతగా చదువుకోవాలని ఉంటే ఆడపిల్లల కాలేజీలో ఏ బి.యేలోనో చేరు' అని మొత్తుకుని చెప్తే విన్నదా అది...అంటూ మనసులో విసుక్కున్నాడు వరంధామయ్య. తను కూడా ఏ లవ్వే గివ్వే అంటూ ఎవడితోనన్నా ఊరేగటం లేదు గదా! అలా ఎన్నటికీ జరగదు. ఈ వరంధామయ్య కట్టుబాట్లు, ఆచారాలు, క్రమశిక్షణ, పర్యవేక్షణలో పెరిగిన పిల్ల అలా చస్తే చేయదు ... అని అనుకున్నాడు చివరికి.. మంచి సంబంధం చూసి ముడిపెట్టేస్తే పోతుంది ఈ సంవత్సరం ...' అని నిర్ణయించుకున్నాడు.

రైలు చివరికి కాకినాడ చేరింది.

ప్రయాణీకులు హడావుడిగా సామానులు దించుకుంటున్నారు.

"వెళ్ళొస్తానండీ" అంటూ బండి దిగాడు ఆ యువకుడు. సామాను సర్దుకుంటున్న వరంధామయ్య కిటికీ దగ్గర్లో కూతురి సుపరిచితమైన కంఠం విన బడ్డంతో ఉలిక్కిపడ్డాడు. కిటికీలోంచి చూశాడు ఆతృతగా.

"హాయ్ కిరణ్! బండి అరగంట లేటు. క్షణమొక యుగంలా గడిచిందనుకో .. మరే..."సావన్‌కో ఆనేదో" పిక్చర్ వచ్చింది. రేపటికి టిక్కెట్స్ రిజర్వు చేసేసా మనిద్దరికీ ..అంకుల్, అంటీ బాగున్నారా? ఇంతకీ కాబోయే కోడలు పంపిన కాకినాడ కాజాలు ఎలా ఉన్నాయన్నారు మీ ఇంట్లో? అరే ...ఏం అలా చిక్కిపోయావ్? డిడ్ యూ మిస్ మి దట్ మచ్?! మై డియర్ బోయ్! యూవిల్ బి ఆల్ రైట్ సూన్.." అని నవ్వుతూ గలగలా మాట్లాడేస్తోంది పద్మ. చిలిపిగా చూస్తూ నవ్వుతూ ఏదో సమాధానం ఇస్తున్నాడా యువకుడు.

బిక్కచచ్చిపోయి అటే చూస్తూ నిల్చుండిపోయాడు పాపం వరంధామయ్య! □